సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



అసలు ఏం జరిగింది?

నిందితుడిని విచారణకు పిలిచి చితక బాదారని కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. IIలో



ఆర్టీసీకి రాఖీ గిఫ్ట్

రాఖీ పండుగ నేపథ్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా, ఆర్టీసీకి రూ.19.10 లక్షల ఆదాయం వచ్చింది. IIలో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, సామూహిక శతనామార్చన గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ రూరల్: శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా పంచామృతాలతో వేదపండితులు అభిషేకం జరిపారు. అనంతరం మంత్రపుష్పం కార్యక్రమాన్ని నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో తనిఖీ

భద్రాచలం : భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి క్లాసులను పర్యవేక్షించి విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అకాడమిక్ క్యాలెండర్ అనుసరించి సిలబస్‌ను పూర్తి చేయలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మెరుగైన బోధనకు పలు సలహాలు, సూచనలను అందచేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు పాల్గొన్నారు.

అడ్మిషన్ గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల తేదీని అపరాధ రుసుంతో ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావును 80084 03522 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

4 నుంచి శ్రీమద్భాగవత సప్తాహం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 4 నుంచి 11 వరకు శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు ఈఓ బి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకూట మండపంలో రోజూ ఉదయం శ్రీమద్భాగవత పారాయణం, భాగవత దశమస్కంద హవనం, సాయంత్రం శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, శ్రీమద్భాగవత ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు నెలలోపు ఎరియర్స్..

సింగరేణి(కొత్తగూడెం): పదకొండో వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఎరియర్స్ చెల్లింపునకు సింగరేణి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదలైంది. సంస్థవ్యాప్తంగా కార్మికులకు సుమారు రూ.1,726 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఒక్కో కార్మికుడికి సగటున రూ 4.లక్షల వరకు రావొచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. నెలలలోపు ఈ ప్రక్రియ పూర్తవుతుందని, ఎరియర్స్‌తోపాటు వేజ్‌బోర్డు ప్రకారం అదనంగా మరో రూ.1,200 కోట్లు కార్మికులకు చెల్లించనున్నట్లు డైరెక్టర్ బలరామ్ తెలిపారు.

తీరం విలవిల

గోదావరి తీరంలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- గత నెలలో తొమ్మిదిమంది మృతి
- మూడు రోజుల్లోనే విషమిస్తున్న పరిస్థితి
- క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే చేపట్టని వైద్యారోగ్యశాఖ



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి తీర ప్రాంతంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలు సోకిన మూడు రోజుల్లోనే పరిస్థితి విషమిస్తోంది. దీంతో ఆస్తులు తాకట్టు పెట్టి ప్రాణాలు దక్కించుకునేందుకు రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఎంత ప్రయత్నించినా ఫలితం కానరాక మరికొందరు మృత్యు ఒడికి చేరుతున్నారు. గత నెల 10 నుంచి నేటి వరకు గోదావరి తీర ప్రాంతంలో విష జ్వరాలతో తొమ్మిది మంది మృతి చెందారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

జిల్లా అంతటా జ్వరాలు, అంటు వ్యాధులు పెరిగిపోతున్నాయి. పరిస్థితి చేయిదాటిపోతోంది అనేట్టుగా గోదావరి తీర ప్రాంతం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల మీదుగా గోదావరి నది ప్రవహిస్తోంది. గడిచిన రెండు వారాలుగా ఈ మండలాల్లో జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మణుగూరు, భద్రాచలంలలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మండలాల వారీగా పరిశీలిస్తే ఇప్పటికే అశ్వాపురంలో నలుగురు, బూర్గంపాడులో నలుగురు మరణించారు. అన్ని ఘటనల్లోనూ బాధితులకు జ్వరం వచ్చిన మూడు రోజుల్లోనే పరిస్థితి విషమించి మృతి చెందారు.

గోదావరి వరదలు తగ్గాక సమస్య తీవ్రం

ఆగస్టులో వర్షాలు లేకపోయినా గ్రామీణ ప్రాంతాల్లో దోమల ఉధృతి పెరిగింది. జూలై చివరి వారంలో భారీ వర్షాలు, వరదలు వచ్చాయి. దీంతో ఆగస్టు మొదటి వారంలో ఫాగింగ్, నీళ్ల నిల్వ ఉన్న చోట దోమల లార్వా పెరగకుండా రసాయనాలు చల్లారు. కానీ ఆ తర్వాత ఈ ప్రక్రియను నిరంతరం చేపట్టడంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఆగస్టు రెండోవారం నుంచి ఒక్కసారిగా దోమల ఉధృతి పెరిగింది. దీని ఫలితంగానే గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా గోదావరి వరద వెనక్కి మళ్లిన తర్వాత తీర ప్రాంత గ్రామాల్లో ఈ సమస్య ఎక్కువైంది.

ఆర్‌ఎంపీల ద్వారా ప్రైవేటు ఆస్పత్రులకు..

క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఆరోగ్యశాఖ నుంచి తగిన స్పందన కరువైపోవడంతో రోగులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వారు అందించే అరకొర వైద్యం కారణంగా జ్వరాల తీవ్రత తగ్గకపోగా మరింతగా ముదురుతోంది. తీరా పరిస్థితి విషమించాక ఆర్‌ఎంపీలు తమతో కాంటాక్టులో ఉండే ఆస్పత్రులకే రోగులను వెళ్లమని సూచిస్తున్నారు. వెరసి దోమల పెరుగుదల నుంచి ఆస్పత్రిలో చికిత్స వరకు అంతటా ప్రభుత్వ యంత్రాంగం ప్రమేయం తగ్గిపోయింది. ఫలితంగా మృతుల సంఖ్య పెరుగుతోంది.

ఇంటింటి సర్వే చేపట్టాలి

తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వ పరంగా వైద్యారోగ్య రంగంలో సేవలు మెరుగుపడ్డాయి. గ్రామస్థాయిలో ఆశలు మొదలు జిల్లా కేంద్రంలో ఎండీ వరకు అందరి కృషి వల్ల వైద్య సేవల్లో పురోగతి వచ్చింది. అయితే గడిచిన నెల రోజులుగా వైద్యసేవల పరంగా స్తబ్దత ఏర్పడిందనే భావన గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. జ్వరాలు వాటి తాలుకు మరణాల సంఖ్య పెరిగినందున క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే నిర్వహించాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

ఇటీవల చోటుచేసుకున్న మరణాలు

- బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామానికి చెందిన పండగ నాగేంద్రబాబు (35) గడిచిన మూడు రోజులుగా విష జ్వరంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూశాడు. దీంతో అతని భార్య, ఇద్దరు పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయినవారయ్యారు. అంతకు ముందు రోజు ఇదే మండలం మోరంపల్లి బంజరకు చెందిన ఏడాకుల పద్మ(38) విషజ్వరం సోకిన మూడు రోజుల్లో మృతి చెందింది. మొత్తంగా ఆగస్టులో ఒక్క బూర్గంపాడు మండలంలోనే నలుగురు విషజ్వరాలతో చనిపోయారు.
- అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వేల్పుల లావణ్యకు ఆగస్టు 26న జ్వరం వచ్చింది. ఆస్పత్రికి వెళ్తే ప్లేట్‌లెట్స్ పడిపోయినట్టుగా గుర్తించారు. ఆ తర్వాత భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆగస్టు 29న చనిపోయింది. అంతకుముందు ఇదే మండలం ఆగస్టు 11న చింతిర్యాల కాలనీకి చెందిన ఇద్దరు, 13న మరొకరు డెంగీతో మృతి చెందారు. ఈ మండలంల కూడా ఆగస్టులో నలుగురు చనిపోయారు.
- కరకగూడెం మండలం కేంద్రానికి చెందిన తిప్పని సంధ్య (17) కొత్తగూడెంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. సోమవారం జ్వరం వచ్చింది బుధవారం భద్రాచలంలో మృతి చెందింది. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి,. హార్ట్ స్ట్రోక్‌తో చనిపోయింది.
- చర్ల మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలకు ప్రతీరోజు పదిహేను మంది వరకు జ్వర పీడితులు వైద్య సేవల కోసం వస్తున్నారు.

సర్వేశ్వరా..!

- నత్తనడకన ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ
- 2,500 దరఖాస్తులకు రెండు నెలలుగా సర్వే
- ప్రస్తుతం గృహలక్ష్మి పథకం పనుల్లో నిమగ్నం
- ఈలోగా ఎన్నికల కోడ్ వస్తే అంతే సంగతులు
- ఆందోళన చెందుతున్న దరఖాస్తుదారులు



పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సర్వే ప్రక్రియ రెండు నెలలుగా నత్తనడకన సాగుతోంది. దీంతో దరఖాస్తుదారులు యాజమాన్య హక్కు వస్తుందో, రాదోననే ఆందోళనలో ఉన్నారు. దశాబ్దాల క్రితం స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి యాజమాన్య హక్కు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టింది. గతంలో 2014 జూన్ 2వ తేదీ లోగా ఇల్లు, ఇంటి నంబర్ కలిగిన స్థలాలకు దరఖాస్తులు స్వీకరించి పట్టాలు ఇచ్చారు. అప్పుడు దరఖాస్తు చేసుకోలేకపోయినవారి కోసం మరో అవకాశం కల్పించారు. ఈసారి 2020లోగా ఇల్లు, ఇంటి నంబర్ పొందిన వారు అర్హులుగా పేర్కొన్నారు. దీంతో గత జూన్ 30 వరకు 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం అధికారులు సర్వే నిర్వహించి పట్టాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. బదిలీ స్థానాల్లో రిపోర్టు చేసిన రోజే తహసీల్దార్లను ఎలక్షన్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం గృహలక్ష్మి పథకం సర్వేలు జరుగుతున్నాయి. దీంతోపాటు ఎలక్షన్ సంబంధించిన పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఫలితంగా క్రమబద్ధీకరణ పట్టాల సర్వే వెనకబడింది. కాగా ఎలక్షన్ కోడ్ వచ్చేలోగా సర్వే పూర్తిచేసి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.

దరఖాస్తుల ప్రక్రియ ఇలా..

మున్సిపాలిటీలో ఇళ్లకు యాజమాన్య హక్కు కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో 373 జీఓను తీసుకొచ్చారు. దీంతో 11 వేల మంది క్రమబద్ధీకరణ పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 4,600 మందికి పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన 6,400 మందికి వివిధ కారణాలతో పట్టాలు ఇవ్వలేదు. పట్టాలు వచ్చినా కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో ఆ పట్టాలకు విలువ లేకుండాపోయింది. మిగిలిపోయినవారి కోసం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో ప్రభుత్వం 76 జీఓ విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం మొదటి విడతలో 6,146 మంది దరఖాస్తు చేసుకోగా 3,500 మందికి గతేడాది పట్టాలు మంజూరయ్యాయి. ఇంకా మిగిలినవారి కోసం 2022 జూలైలో దరఖాస్తులకు చివరి అవకాశం ఇవ్వగా 1,531 మంది దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నిర్వహించిన అధికారులు కేవలం 530 మందికి మాత్రమే పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన దరఖాస్తులను తిరస్కరించారు. అయితే పట్టాల ప్రక్రియ మొదటి నుంచి అవినీతి ఆరోపణలతో ముందుకు సాగుతోంది. సర్వే బృందాలతోపాటు వార్డు ప్రజాప్రతినిధులు ఇంటి యజమానుల వద్ద చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేకపోయినా పట్టాలు మంజూరు చేసిన దాఖలాలున్నాయి. ప్రభుత్వ స్థలంలో అప్పటికప్పుడు రూంల నిర్మాణాలు చేసి పట్టాలు పొందడం, ఒకే స్థలానికి రెండు పట్టాలు మంజూరు కావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారిని కూడా బదిలీ చేశారు. ఇప్పటికైనా సర్వే పారదర్శకంగా నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సర్వే బృందాలు తిరుగుతున్నాయి

కొత్తగూడెం పట్టణంలో 76 జీఓ ప్రకారం 2020లోగా ఇల్లు, ఇంటి నంబర్ పొందినవారు చేసుకున్న దరఖాస్తులపై సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం గృహలక్ష్మి ఇళ్ల స్థలాల సర్వే కూడా జరుగుతోంది.

–పుల్లయ్య, కొత్తగూడెం తహసీల్దార్

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నేడు, రేపు ప్రత్యేక క్యాంపులు



కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 2, 3వ తేదీల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఆమె అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 1.10.2023 నాటికి 18 ఏళ్లు నిండే యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇదివరకే నమోదైన ఓటర్లు జాబితాలో తమ పేరును పరిశీలించుకోవాలని చెప్పారు. తప్పులు ఉంటే ప్రత్యేక క్యాంపుల్లో దరఖాస్తులు చేయాలని చెప్పారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, సవరణలకు ఫారం 8, తొలగింపునకు ఫారం–7 పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై ప్రతి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. విచారణ ప్రక్రియను తహసీల్దార్లు, ఎంపీడీఓలు తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కనకయ్య తదితరులు

కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు/పాల్వంచరరూరల్: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇల్లెందులో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో అయితా గంగాధర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా, పొంగులేటి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. అధికార పార్టీ అభ్యర్థులు డబ్బుల మూటలతో వస్తారని, వారు డబ్బులు ఇస్తే తీసుకుని ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే రూ.500 వంటగ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వివరించారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే ఇద్దరికి రూ. 5 వేల పింఛన్ పథకం వర్తింపజేస్తామని, ఆసరా పింఛన్ రూ. 4 వేలకు పెంతామన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ పిట్టల దొరను తలపించే మాటలతో మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వారానే పేదల సంక్షేమం సాధ్యమని అన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలి

ఇల్లెందు: సమష్టి కృషితోనే కాంగ్రెస్ విజయం సాధ్యమవుతుందని.. అలాకాకుండా ఒంటెత్తు పోకడలకు పోతే నష్టం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, మంగీలాల్ నాయక్, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ జి.రవి పేర్కొన్నారు. ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ అధిష్టానం పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలని కోరారు. అయితే, తన వర్గంగా పేరున్న వారికే పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రచారం చేయటం సరికాదని పేర్కొన్నారు. తమకు సమాచారం లేకుండా సొంత అజెండాతో హడావుడిగా ప్రచారం చేస్తే విజయం సాధ్యం కాదని, అందరినీ కలుపుకుని వెళ్తేనే మంచిదని తెలిపారు. కాగా, పార్టీ పట్టణ, మండల కమిటీలన్నీ రద్దయ్యాయని, ఏ కమిటీలు మనుగడలో లేవని వారు వెల్లడించారు.

ఈ కార్యక్రమాల్లో నాయకులు ఊకంటి గోపాల్‌రావు, జాలె జానికిరెడ్డి, నాగా సీతారాములు, రామారావు, తుళ్లూరి బ్రహ్మయ్య, యదళపల్లి అనసూర్య, డి. డానియేల్, పి. సైదులు, పత్తి స్వప్న, బోగ నందకిషోర్, జీవీ భద్రం, ఇమామ్, మహబూబ్, గూడ బాబూరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

అంతులేని అసంతృప్తి

- బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న కోల్డ్‌వార్
- పలు నియోజకవర్గాల్లో మారని పరిస్థితి
- టికెట్ల కేటాయింపులో ముఖ్య నేతల వ్యవహారంపై గుర్రు
- తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని అసహనం
- ఇన్‌చార్జ్‌లను నియమించి పర్యవేక్షిస్తున్న అధిష్టానం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీలో 'కోల్డ్‌వార్' కొనసాగుతోంది. అన్ని నియోజకవర్గాలకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించినా.. ముఖ్యనేతల మధ్య సఖ్యత కుదరడం లేదు. అభ్యర్థుల విషయంలో తమ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదని పలువురు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కుమ్ములాటలే నియోజకవర్గ సమన్వయ సారథులను మార్చే వరకు వెళ్లినట్లు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పైకి అంతా బాగున్నట్లు కనిపిస్తున్నా.. అంతర్గత వ్యవహారం ఇందుకు భిన్నంగా ఉందనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది.

ముందుగానే ప్రకటించినా..

బీఆర్‌ఎస్‌లో ఆశావహుల జాబితా భారీగా ఉండడంతో అసమ్మతిని చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించారు. అయితే ఇల్లెందు, పాలేరు, భద్రాచలం నియోజకవర్గాల్లో అభ్యర్థులపై ఆశావహుల అసంతృప్తి కొనసాగుతోంది. పార్టీని నమ్ముకున్న వారిని కాదని ఇటీవల వచ్చిన వారికే పెద్దపీట వేశారనే విమర్శలు వస్తున్నాయి. పార్టీలోని కొందరు ముఖ్యనేతల వ్యవహార శైలితోనే ఇలా జరిగిందనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. అంతేకాకుండా అసంతృప్తులు, అభ్యర్థుల నడుమ సయోధ్య కుదర్చాల్సిన నేతలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఎన్నికల్లో అభ్యర్థులకు నష్టం జరుగుతుందనే వాదన వినిపిస్తుండగా.. అధిష్టానం ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మూడింట 'కార్'చిచ్చు

ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో చిచ్చు చల్లారడం లేదు. పాలేరు, ఇల్లెందు, భద్రాచలంలో అభ్యర్థులపైనే గురిపెట్టిన ఆశావహులు, వారి అనుచరులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. పాలేరు నియోజకవర్గాన్ని పరిశీలిస్తే మాజీ మంత్రి తుమ్మల కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు అంతా సిద్ధమైనట్లేనని అనుచర వర్గం భావిస్తోంది. ఇప్పటికే నాలుగు మండలాల్లో అనుచరులు ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పడంతో తుమ్మల వెంట బీఆర్‌ఎస్ నుంచి ఎవరెవరు వెళ్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఇల్లెందులో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వర్గాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వరకు వెళ్లినా ముగియలేదు. అలాగే, భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు, పార్టీ నేత బోదబోయిన బుచ్చయ్యల మధ్య పొసగడం లేదు. ఈ స్థానం నుంచి బుచ్చయ్య చివరి వరకు ప్రయత్నం చేసినా... కాంగ్రెస్ నుంచి ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన వెంకట్రావుకు టికెట్ ఇవ్వడంతో ఆయన పార్టీలోని ముఖ్య నేతల తీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కూడా పార్టీలోని కొందరు నేతల తీరుపై అసహనంగా ఉన్నారని సమాచారం. ఈ క్రమంలోనే నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు తాజాగా సమావేశమై అభ్యర్థిని మార్చడంతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసానినే కొనసాగించేలా అధిష్టానాన్ని కోరాలని నిర్ణయించడం గమనార్హం.

నేతల తీరుతోనే మార్పు

అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం కేసీఆర్ ఆచితూచి వ్యవహరించడమే కాక సర్వే నివేదికలే ప్రామాణికంగా తీసుకున్నారని ప్రచారం జరిగింది. ఇక అసంతృప్తులను బుజ్జగించి నియోజకవర్గ ముఖ్యనేతలు, కేడర్‌ను సమన్వయం చేసేందుకు ఇన్‌చార్జిలను నియమించారు. ముందుగా అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించగా... ఇటీవల పరిణామాలు, కొందరు నేతల తీరుతో మూడు, నాలుగు చోట్ల సారథులను మార్చినట్లు సమాచారం. అంతేకాకుండా పార్టీలోని కొందరు ముఖ్య నేతలపై అభ్యర్థులుగా ఎంపికైన వారు అసహనంతో ఉన్నట్లు తెలిసింది. అసంతృప్తులను బుజ్జగించాల్సిన వారు... తమపైకి ఉసిగొలుపుతున్నారనే ఆగ్రహంతో అభ్యర్థులు ఉండగా, ఇదే తరహా భావన అధిష్టానంలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

'అతి' చేయొద్దు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ఒక్కో స్థానమే వచ్చింది. ఈ పరిస్థితులతో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను ఖమ్మంలో నిర్వహించారు. పదవుల పరంగా కూడా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్టానం... రానున్న ఎన్నికల్లో పార్టీలోని ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధుల 'త్రయం'లో ఎవరు అతి చేసినా చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరిక జారీ చేసినట్లు తెలిసింది. అంతా ఐక్యంగా ఉండి పదికి పది స్థానాలు గెలిచేలా చూడాలని ఆదేశించినట్లు చెబుతుండగా.. పరిస్థితులు ఎప్పు డు చక్కబడతాయోననే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది.

మరో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు

ఇల్లెందు, మణుగూరులకు మంజూరు

ఇల్లెందు/మణుగూరు రూరల్: జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో రెండు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. ఇందు కోసం ఒక్కో సెంటర్‌కు రూ. 1.43 కోట్ల చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశారు. ఈ మేరకు రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ నుంచి ఆదేశాలు విడుదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 14 కేంద్రాలు మంజూరు కాగా, జిల్లాకు రెండు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో ఐదు యూపీహెచ్‌సీలు రామవరం, సఫాయిబస్తీ, పాత కొత్తగూడెం, శేఖరబంజర, గుడిపాడులో పనిచేస్తున్నాయి. కొత్తగా మంజూరైన రెండు కేంద్రాలతో వాటి సంఖ్య ఏడుకు చేరింది. నూతన అర్బన్ ప్రాథమిక హెల్త్ సెంటర్‌లో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు, ఐదుగురు ఏఎన్ఎంలు, సీఓ, ఎల్టీ, ఫార్మసిస్ట్, అకౌంటెంట్ ఉంటారు. మందుల సరఫరా, నిర్వహణ డీఎంహెచ్‌ఓ పరిధిలో సాగనుండగా, వేతనాలు మాత్రం నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఇస్తారు.

క్లుప్తంగా

టేకు ప్లాంటేషన్ పరిశీలన



చెట్ల కొలతలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ, అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల సెక్షన్‌లోని లింగాపురం బీట్ 1943, 1944, 1945 టేకు ప్లాంటేషన్‌ను డీఎఫ్ఓ కృష్ణగౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెట్ల కొలతలను తీయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అడవులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలని సిబ్బందికి సూచించారు. అటవీసంపద సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రేంజర్ కనకమ్మ, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై చైతన్యం కల్పించాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శిరీష

కరకగూడెం: ఆరోగ్యంపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం కల్పించాలని డీఎంహెచ్ఓ శిరీష పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కరకగూడెం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని మండలంలో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీకి అదనపు వైద్యాధికారి దుర్గం నరేశ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి ఆరా తీశారు కార్యక్రమంలో వైద్యులు సంజీవరావు, కారం మధు, దుర్గం నరేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతరుల దరఖాస్తులపై కదలిక

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: గృహలక్ష్మి పథకంలో భాగంగా గిరిజనేతరులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలని శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు ఆదేశించారు. 'గృహలక్ష్మి'కి ఆంక్షలెన్నో శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం సాయంత్రం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో గృహలక్ష్మికి సంబంధించి గిరిజనేతరుల దరఖాస్తులపై ప్రత్యేకంగా మండల స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనేతరుల స్థలానికి ఉన్న ఆధారాలు ఏంటని ప్రశ్నించారు. 1970కి ముందు బాండ్ పేపర్లు ఎవరి వద్ద లేవని, తెల్లకాగితంపై రాసుకున్నవి మాత్రమే ఉన్నాయని, మరి కొంత మందికి అప్పటి ప్రభుత్వమే ఇంటి స్థలాలు కేటాయించిందని, కానీ, దరఖాస్తుదారుల వద్ద నాటి ధ్రువపత్రాలు లేవని మండల అధికారులు వివరణ ఇచ్చారు. దరఖాస్తుదారులు సుమారు 30 ఏళ్లకు పైగా అదే గ్రామంలో నివాసం ఉంటున్నారని, గతంలో వారు నివసించిన ఇంటికి సంబంధించి ఇంటి పన్ను కూడా చెల్లించి ఉన్నారని గుర్తుచేశారు. దీంతో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని మండల అధికారులను టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు ఆదేశించారు.

నాలుగు నెలల చిన్నారి మృతి

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామం చింతకుంటలో మడకం జగన్, లక్ష్మి దంపతుల నాలుగు నెలల చిన్నారి శుక్రవారం మృతి చెందింది. చిన్నారి రాత్రి తల్లి పక్కన పడుకోగా తెల్లవారేసరికి మృతి చెందింది. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, పాప మృతికి గల కారణాలు తెలియరాలేదు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. బోడు ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం.. మండలంలోని పాతర్లగడ్డకు చెందిన మేకల పొట్టయ్య(63) గత నెల 9న బైక్‌పై టేకులపల్లికి బయలుదేరాడు. పెట్రాంచెలకస్టేజీ వద్దకు రాగానే అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం మృతుడి కుమారుడు సీతారాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బోడు ఎస్ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

అసలు ఏం జరిగింది?

- విచారణ పేరుతో నిందితుడిని కొట్టారని పోలీసులపై ఆరోపణలు
- నిందితుడి భార్య, తండ్రిని సైతం దూషించారని ఆక్షేపణ
- పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించాలంటున్న బాధితులు

కొత్తగూడెంఅర్బన్: శాంతిభద్రతల విభాగంలో ఎంతో పేరు తెచ్చుకున్న 'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానంపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. ఓ కేసులో విచారణకు పిలిచిన నిందితుడిని చితకబాదడమే కాకుండా ఇదేంటని ప్రశ్నించి అతడి భార్యపైనా దురుసుగా ప్రవర్తించారంటూ కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులపై విమర్శలు వచ్చాయి. కొత్తగూడెంలోని గాజులరాజంబస్తీకి చెందిన తాజుద్దీన్ కథనం ప్రకారం.. తాజుద్దీన్ కొడుకు రఫీయుద్దీన్‌కు వివాహమైంది. భార్య ఇద్దరు పిల్లలతో స్థానికంగా నివాసం ఉండేవాడు. రెండు నెలల కిందట కొత్తగూడెం రైతుబజార్ సమీపంలో జరిగిన గలాటలో ఓ బస్సుకు చెందిన టీవీ పగిలిపోయింది. ఈ ఘటనపై 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రఫీయుద్దీన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా రెండు నెలల కిందట రఫీయుద్దీన్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విపరీతంగా కొట్టారు. తీవ్రగాయాలపాలైన బాధితుడు చికిత్స తీసుకున్న తర్వాత భార్య పిల్లలతో కలిసి ఊరు విడిచి హైదరాబాద్ వెళ్లాడు. కాగా, కేసు విచారణ నిమిత్తం సెప్టెంబరు 1న శుక్రవారం కొత్తగూడెం పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. దీంతో శుక్రవారం భార్యాపిల్లలతో రఫీయుద్దీన్ వచ్చాడు. విచారణ పేరుతో ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురి వివరాలు చెప్పాలంటూ భార్య ముందే రఫీయుద్దీన్‌ను పోలీసులు తీవ్రంగా కొట్టడం ప్రారంభించారు. అతను గట్టిగా కేకలు వేయడంతో 'నా భర్తను ఎందుకు కొడుతున్నారు' అంటూ ప్రశ్నించిన రఫీయుద్దీన్ భార్య పట్ల అసభ్యకరంగా పోలీసులు ప్రవర్తించారు. బయటకు వెళ్లాలంటూ గెంటేశారు. ఇదే సమయంలో పోలీసులతో మాట్లాడేందుకు తాజుద్దీన్ ప్రయత్నించగా 'ఎక్కువ తక్కువ మాట్లాడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తా' అంటూ ఖాకీలు బెదిరింపులకు దిగారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్ ఎదుటే కుటుంబ సభ్యులంతా భయాందోళనలతో పడిగాపులు కాస్తూ ఉండిపోయారు. మరోవైపు పోలీస్ స్టేషన్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రఫీయుద్దీన్ చిన్న కూతురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై రఫీయుద్దీన్ భార్య మాట్లాడుతూ.. తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించాలని, కానీ, పని చేసుకోలేని విధంగా కొడితే ఎలా బతికేది అంటూ ప్రశ్నించింది. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించాలని, అందులో ఎవరి పట్ల ఎవరు అమర్యాదగా, అవమానవీయంగా ప్రవర్తించారో తెలుస్తుందని డిమాండ్ చేసింది.

రౌడీ షీటర్ల కట్టడిలో భాగమే..



నేరచరిత్ర కలిగిన రఫీయుద్దీన్ పాత కేసులకు సంబంధించి పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడు. పట్టణంలో రౌడీ షీటర్ల కట్టడిలో భాగంగా పాత కేసులలో నిందితులుగా ఉండి, ఆచూకీ లేకుండా తిరుగుతున్న వారిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. రఫీయుద్దీన్ కుటుంబ సభ్యులు చెబుతున్నవి అవాస్తవాలు. వారే పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ చేశారు.

– మురళి, సీఐ త్రీటౌన్

పాత కేసుల్లో నిందితుడు..



నిందితుడు రఫీయుద్దీన్ పాత కేసులలో నిందితుడిగా ఉన్నాడు. పోలీస్ స్టేషన్‌లో అతడిని ఏం చేస్తారో అని వారి కుటుంబ సభ్యులు ముందస్తుగా ఆందోళన చేసి అందరినీ తప్పుదోవ పట్టించారు. వారు చెబుతున్నది నిజమైతే విచారణకు రమ్మని చెబితే రావడం లేదు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారు శిక్షర్హులవుతారు.

– రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

ఇంజనీరింగ్ పనుల్లో అలసత్వం వద్దు..

- నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు
- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ద్వారా చేపడుతున్న పనుల్లో అలసత్వం వహించినా, నాణ్యత లోపించినా బాధ్యులపై శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని పీఓ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో రోడ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్ల పనుల్లో నాణ్యత పాటించాలని, గిరిజనులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎవరైనా టెండర్ దారులు పనులు చేయని పక్షంలో రద్దు చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఆదర్శ గ్రామ యోజన పథకం కింద మంజూరైన నిధులను ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ స్కూళ్లు, సబ్ సెంటర్లకు కేటాయించి.. పనులు పూర్తయ్యాక నిధులు మిగిలితే ఇతర స్కూళ్లకు కేటాయించాలని చెప్పారు.

కనీస సామర్థ్యాలు తప్పనిసరి

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్‌లలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు ఉండేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురుకులాలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గిరిజన విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించి సబ్జెక్టుల వారీగా నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏసీఎంఓ రమణయ్య పాల్గొన్నారు.

ఈ ఎంపీడీఓ మాకొద్దు..

గుండాల: ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సమాచారం కూడా ఇవ్వని ఎంపీడీఓ మండలానికి వద్దని, తక్షణమే సరెండర్ చేయాలని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ సభ్యురాలు వాగబోయిన రామక్క డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. గత నెల 14వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణను సరెండర్ చేయాలని తీర్మానం చేసి, ఉన్నతాధికారులకు తెలిపినా నేటికీ పట్టించుకోవడం లేదన్నారు. బీసీ, మైనార్టీ రుణాలు, ట్రైకార్ రుణాల ఎంపికపై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వొద్దని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయని చెబుతున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో సీఎం కేసీఆర్ మండలాల అభివృద్ధిపై సమావేశం ఉందని, ఎంపీడీఓ సమాచారం ఇవ్వకపోవడంతో తాము గైర్హాజరయ్యామని వెల్లడించారు.

ఇప్పటికైనా ఎంపీడీఓను సరెండర్ చేయకపోతే తాము కార్యాలయానికి, సమావేశాలకు, కార్యక్రమాలకు వెళ్లేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, పర్శిక పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రాఖీ గిఫ్ట్!

రెండు రోజుల్లో
రూ.29.10 లక్షల అదనపు ఆదాయం



కార్మికులకు స్వీట్లు పంచుతున్న డీఎం వెంకటేశ్వరరావు తదితరులు

చుంచుపల్లి: ఆర్టీసీకి రక్షాబంధన్ ఆదాయం తెచ్చిపెట్టింది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలోని మూడు డిపోల పరిధిలో 50 వరకు ప్రత్యేక బస్సులను నడిపారు. బుధ, గురువారాల్లో బస్టాండ్లు, బస్సులతో ప్రయాణికులతో కిటకిటలాడాయి. దీంతో రోజువారీ లక్ష్యాలు మినహాయించగా రూ.29.10 లక్షల అధికంగా ఆదాయం వచ్చింది. భద్రాచలం డిపోకు రూ.8.49 లక్షలు, కొత్తగూడేనికి రూ.10.88 లక్షలు, మణుగూరుకు రూ.9.72 లక్షల చొప్పున అదనపు ఆదాయం సమకూరింది. ఈ నెల 30న రూ.6.28 లక్షలు, 31న అత్యధికంగా రూ.22.82 లక్షల ఆదాయం వచ్చింది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేసి పక్కగా చర్యలు తీసుకుకున్నారు. దీంతో ఆర్టీసీ లక్ష్యాన్ని మించి రాబడి సాధించింది. ఆదాయం పెరగడంతో అధికారులు శుక్రవారం కొత్తగూడెం బస్ డిపోలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాగా తతేడాది మాదిరిగానే రక్షాబంధన్‌తో ఆర్టీసీకి అదనపు ఆదాయం వచ్చిందని, 30,31 తేదీల్లో ప్రయాణికుల రద్దీ కొనసాగిందని, మహిళలకు ప్రత్యేక బహుమతుల స్కీమ్ ప్రవేశపెట్టడం కూడా కొంత కలిసొచ్చిందని కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు వివరించారు.

30, 31 తేదీల్లో ఆర్టీసీ ఆదాయ వివరాలు.. (రూ.లక్షల్లో)

డిపో	లక్ష్యం	30న	31న	రాఖీ ఆదాయం
భద్రాచలం	20.26	20.79	28.24	8.49
కొత్తగూడెం	12.48	16.66	19.19	10.88
మణుగూరు	15.39	16.98	23.53	9.72

భద్రాచలం అభ్యర్థి ఎంపికపై నిరసన

- బీఆర్ఎస్ కోసం కష్టపడే వారికే టికెట్ ఇవ్వాలి
- ఇన్‌చార్జ్‌ను మార్చడాన్నీ తప్పుపట్టిన నేతలు



చర్లలో సమావేశమైన ఐదు మండలాల ముఖ్య నాయకులు

చర్ల: భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నేతలు నిరసన గళం వినిపించారు. అభ్యర్థిని పార్టీ అధిష్టానం ఏకపక్షంగా ప్రకటించిందని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ములుగు జిల్లా పరిధి వాజేడు, వెంకటాపురం, భద్రాద్రి జిల్లా పరిధి చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలు మారుతూ, ప్రజలకు దూరంగా ఉన్న డాక్టర్ తెల్లం వెంకట్రావును అభ్యర్థిగా ప్రకటించడంతో పాటు భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణను మార్చి ఎమ్మెల్సీ తాతా మధును నియమించడంపై వారు నిరసన తెలిపారు. ఈ సమయంలో కనీసం మండల బాధ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సరికాదన్నారు. ఇన్‌చార్జ్‌గా లక్ష్మీనారాయణను కొనసాగిస్తూనే, భద్రాచలం అభ్యర్థిగా సమర్థత కలిగిన వారికి అవకాశం ఇవ్వాలని కోరుతూ త్వరలో మంత్రి కేటీఆర్‌ను కలవాలని నిర్ణయించారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, నాయకులు మానె రామకృష్ణ, తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, యశోద నగేశ్, బల్లా రాంబాబు, జానీపాషా, సోయం రాజారావు, లంకరాజు, కాపుల కృష్ణార్జునరావు, కాకి అనిల్, గంపా రాంబాబు, శివాజీ లక్ష్మీనారాయణ, పెనుమల్ల రామకృష్ణారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడిచేసిన భర్త

ఆమె కుటుంబ సభ్యులపైనా దాడి

జూలూరుపాడు: భార్య కాపురానికి రావడంలేదనే కక్షతో భర్త కత్తితో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని పడమటనర్సాపురం జీపీ దేస్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దేస్యాతండాకు చెందిన కృష్ణవేణికి కొత్తగూడెం పట్టణం గాజులరాజంబస్తీకి చెందిన భూక్య కుమార్ పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినా ఫలితం లేకుండాపోయింది. దీంతో కృష్ణవేణి ఏడాది కాలంగా పుట్టింట్లో ఉంటూ జూలూరుపాడు ఎస్‌బీఐలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో కుమార్ శుక్రవారం రాత్రి దేస్యాతండాకు వెళ్లి మూడు కత్తులతో హల్‌చల్ చేశాడు. కృష్ణవేణి, ఆమె సోదరుడు గుగులోత్ తరుణ్, అత్త అరుణపై దాడి చేశాడు. అడ్డుపడిన కృష్ణవేణి బాబాయి సేవ్యాపై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణవేణిని స్థానికులు 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా, కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



తీవ్రంగా గాయపడ్డ కృష్ణవేణి

కేసు నమోదు

పినపాక: ఎలాంటి అనుమతులు లేకుండా అడవిలో చెట్లు నరుకుతున్న వ్యక్తిపై శుక్రవారం ఈ–బయ్యారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి కేసు నమోదు చేశారు. అటవీ అధికారుల కథనం ప్రకారం.. దుగ్నేపల్లి బీటీ ఏరియాలో అదే గ్రామానికి చెందిన సక్రు అడవిలో చెట్లను నరికి శుభ్రం చేస్తుండగా అటవీశాఖ సిబ్బంది అదుపులోకి తీసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. అతడిపై ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తేజస్వి తెలిపారు.అనుమతి లేకుండా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

మట్కా జూదరుల అరెస్టు

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి కూలీలైన్ ఏరియాలో ప్రాంతంలో మట్కా ఆడుతున్న వారిని శుక్రవారం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మురళి కథనం ప్రకారం.. మట్కా ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఘటనా స్థలానికి వెళ్లి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 8 మొబైళ్లు, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మట్కా ఆడిస్తున్న లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఇద్దరు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం అందించొద్దని ప్రభుత్వ వైద్యాధికారి రేవంత్ అన్నారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలం మర్కోడులో ఓ క్లీనిక్, ల్యాబ్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఇటీవల ఓ జ్వరబాధితుడికి ఆర్ఎంపీ వైద్యం అందించగా వికటించి సదరు వ్యక్తి మృతి చెందినట్లు ఆరోపణలు వస్తుండడంతో క్లీనిక్‌లను, ల్యాబ్‌లను పరిశీలించినట్లు తెలిపారు. ఆర్ఎంపీలు ఎవరైనా ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజక్షన్లు, సెలైన్లు పెట్టొద్దని చెప్పారు. పరిమితికి మించి వైద్యం అందించినా, టెస్టులు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు జ్వరం వస్తే వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి రావాలని, ఆర్ఎంపీలను ఆశ్రయించొద్దని సూచించారు.



క్లీనిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారి

స్కూల్‌లో డిజిటల్ టీవీ చోరీ

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి హైస్కూల్ డిజిటల్ టీవీ గురువారం రాత్రి చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. హైస్కూల్‌లోని 8వ తరగతి గది తలుపులు పగలగొట్టి సుమారు రూ.4 లక్షల విలువ గల డిజిటల్ టీవీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చి చూడగా 8వ తరగతి గది తలుపులు పగలగొట్టి ఉండటంతోపాటు డిజిటల్ టీవీ కనిపించకపోవడంతో హెచ్ఎం లలితాభవాని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. జూలూరుపాడు ఏఎస్ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బందితోపాటు గుండెపుడి సర్పంచ్ బానోత్ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న పోలీసులు

కొండచిలువను పట్టుకున్న స్థానికులు

కొత్తగూడెంటౌన్: మూడో వార్డు పరిధి గౌతమ్‌నగర్‌కాలనీలో శుక్రవారం 10 అడుగుల భారీ కొండచిలువను స్థానికులు, హసన్ టీం సభ్యులు పట్టుకున్నారు. పారిశుధ్య పనులు చేస్తున్న వారికి కొండచిలువ కనిపించడంతో హసన్ టీంకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కొండచిలువను పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.



కొండచిలువను చూపుతున్న యువకులు

ఉద్యోగం పేరిట టోకరా

- నకిలీ అపాయింట్‌మెంట్‌తో మోసం
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ సంతకం ఫోర్జరీ
- సారపాకలో వెలుగుచూసిన ఘటన

బూర్గంపాడు: బీటీపీఎస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌తో ఓ వ్యక్తి చేసిన బురిడీ వ్యవహారం బెడిసికొట్టింది. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఫోర్జరీ సంతకంతో నియామకపు ఉత్తర్వులు సృష్టించి విజిలెన్స్‌కు అడ్డంగా దొరికిపోయారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో పర్మనెంట్ కార్మికుడిగా పనిచేస్తున్న వీబీ ప్రవీణ్‌కుమార్ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. ప్రవీణ్‌కుమార్ తనతో పాటుగా ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న ఇరవెండి గ్రామానికి చెందిన మాడపాటి రాజశేఖర్‌కు మణుగూరు బీటీపీఎస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకోసం రూ.10 లక్షల బేరం కుదుర్చుకున్నాడు. సుమారు రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా.. ఉద్యోగం వచ్చిన తరువాత మిగతా డబ్బులు చెల్లించేటట్లు ఒప్పందం చేసుకున్నారు. డబ్బుల కోసం మధ్యమధ్యలో ప్రవీణ్‌కుమార్ ఒత్తిడి తీసుకు వచ్చినా రాజశేఖర్ మాత్రం ఉద్యోగం వచ్చిన తరువాతే ఇస్తానని తేల్చిచెప్పాడు. దీంతో ప్రవీణ్‌కుమార్ ఆలోచనలో పడ్డాడు. ఫేక్ అపాయింట్‌మెంట్ సృష్టించి డబ్బులు తీసుకోవాలని పథకం వేసుకున్నాడు. ఈ పథకంలో భాగంగానే ఓ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ సృష్టించాడు. ఏకంగా ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సంతకాన్ని ఫోర్జరీ చేసి అపాయింట్‌మెంట్ లెటర్ తయారుచేసి రాజశేఖర్‌కు వాట్సాప్ చేశాడు. ఆగస్టు 29న అపాయింట్‌మెంట్ ఇచ్చి డబ్బులు అడిగాడు. రాజశేఖర్‌కు, అతని బంధువులకు అపాయింట్‌మెంట్ లెటర్‌పై అనుమానాలు వచ్చాయి. బీటీపీఎస్, కేటీపీఎస్ అధికారుల వద్దకు ఆ లెటర్ తీసుకెళ్లి చూపించగా ఉద్యోగ నియామకం కోసం తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. దీంతో రాజశేఖర్ హైదరాబాద్‌లోని తమ బంధువులతో కలసి విద్యుత్ సౌధకు వెళ్లాడు. విద్యుత్‌సౌధలో ఆ లెటర్‌ను పరిశీలించిన అధికారులు విజిలెన్స్‌కు సమాచారమిచ్చారు. విజిలెన్స్ అధికారులు ఆ లెటర్‌ను పరిశీలించి సీఎండీ ప్రభాకర్‌రావు ఫోర్జరీ సంతకంతో పాటుగా నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌ను సృష్టించినట్లుగా గుర్తించారు. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై సీఎండీ ప్రభాకర్‌రావు కూడా ఆగ్రహం వ్యక్తం చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వ్యవహారం సారపాకలో శుక్రవారం సంచలనంగా మారింది. ఐటీసీలో 'ఏ'షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన వెళ్లిన ప్రవీణ్‌కుమార్ ఈ విషయం తెలిసి ఉదయం 9.30 గంటల సమయంలో డ్యూటీ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఈ వ్యవహారం బయటపడటంతో మరికొందరు కూడా ప్రవీణ్‌కుమార్ బాధితులు మోసపోయామని గుర్తించినట్లు తెలుస్తోంది. బాధితుడు రాజశేఖర్ ఫిర్యాదుతో బూర్గంపాడు ఎస్ఐ రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. భద్రాచలంలోని ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉంది. ప్రవీణ్‌కుమార్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉందని తెలిసింది. ఈ ఘటనతో మరికొందరు బాధితులు కూడా వెలుగులోకి వచ్చే అవకాశముందని చర్చసాగుతోంది.



(BY ORDER AND IN THE NAME OF TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED)

D.PRABHAKAR RAO
CHAIRMAN & MANAGING DIRECTOR

To
MANDAPATI RAJASEKHAR

సీఎండీ ప్రభాకర్‌రావు ఫోర్జరీ సంతకంతో ఉన్న నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
556	182
65,387	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత) 59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత) 59,251	▲	4
వెండి (కిలో) 74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్ద్వంద్వంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!

న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.



ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతి	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రోలలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రోలు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



కుమారుడితో ఇస్నర్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**